కొత్త కౌలు చట్టం కలే..!

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కౌలుచట్టంలో మార్పులు చేస్తున్నట్లు చెప్పింది. దీంతో కౌలురైతులకు న్యాయం జరుగుతుందని అంతా భావించారు. వైసిపి 2019లో చేసిన 'ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారుని హక్కుచట్టం' కౌలురైతులకు ఉరితాడుగా మారింది. భూయజమాని అంగీకారంతోనే కౌలురైతులకు కౌలుకార్డులు ఇవ్వాలంటూ కొత్తచట్టంలో మార్పులు చేసింది. దీంతో కౌలురైతులకు కౌలుకార్డులు అందని ద్రాక్షగా మారాయి. దీంతో అధికారులు కౌలురైతుల సంఖ్యను తక్కువగా చూపిస్తూ ఏమార్చేందుకు ప్రయత్నాలు చేయడం ప్రారంభించాయి. ఈ చట్టంతో కౌలుకార్డులు అందకపోవడం, బీమా, పంట నష్టపరిహారం వంటి ఏఒక్క ప్రభుత్వ సాయమూ కౌలురైతులకు అందకుండా పోయింది. చివరికి తాను పండించిన పంటను సైతం కౌలురైతులు తన పేరున అమ్ముకునేందుకు వీల్లేకుండా వైసిపి చేసిన చట్టం తయారైంది. దీంతో కష్టాల ఊబిలో కూరుకుపోవడంతో కౌలురైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయి. కొత్త కౌలుచట్టంపై తొలుత హడావుడీ..తర్వాత మౌనంతాము అధికారంలోకి వస్తే కొత్త కౌలుచట్టం తీసుకొచ్చి కౌలురైతులకు న్యాయం చేస్తామని టిడిపి కూటమి చెప్పింది. అధికారంలోకి వచ్చిన వెంటనే కౌలుచట్టం ముసాయిదా తయారు చేసేందుకు అభిప్రాయ సేకరణ పేరుతో జిల్లాల వారీగా కొన్నిచోట్ల సమావేశాలు నిర్వహించింది. శీతాకాల సమావేశాల్లో కొత్త కౌలుచట్టం చేస్తామంటూ హడావుడీ చేసింది. జిల్లాలో సమావేశం ఏర్పాటుకు సంబంధించి రెండు సార్లు తేదీలు ప్రకటించి రద్దు చేసింది. ఆ తర్వాత కౌలుచట్టం ఊసే లేకుండా పోయింది. శీతాకాల సమావేశాలు, బడ్జెట్ సమావేశాలు కూడా ముగిసిపోయాయి. భూ యజమానుల ఒత్తిడి మేరకు కొత్త కౌలుచట్టంపై ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్త కౌలుచట్టం చేసి వచ్చే ఖరీఫ్ నుంచి కౌలురైతులకు ప్రభుత్వం అందించే అన్ని పథకాల అందేవిధంగా చేస్తుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. కొత్త కౌలుచట్టం చేస్తే లబ్ధిపొందే వారిలో జిల్లాలోని రైతులే ఎక్కువగా ఉంటారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఎంఎల్ఎలు సైతం కౌలుచట్టం గురించి మాట్లాడకపోవడం ఆశ్చర్యంగా ఉంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటుందో లేదో చూడాల్సి ఉంది.

చదువు'కొనాల్సిందే' : ప్రభుత్వ నిబంధనల మేరకు ఒకటోతరగతి నుండి మూడో తరగతి వరకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.6వేలు, మండల కేంద్రాల్లో ఉన్న పాఠశాలల్లో రూ.7,500, పట్టణాల్లో 8,600, జిల్లా కేంద్రంలో రూ.10వేలు చొప్పున ఫీజులు నిర్ధారించారు. 4 నుంచి 5 తరగతులకు గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.9వేలు, పట్టణాల్లో రూ.10,500, జిల్లా కేంద్రంలో రూ.12వేలు, ఆరోతరగతికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.9వేలు, మండల కేంద్రాల్లో రూ.9,500, పట్టణాల్లో రూ.11,100 పాఠశాల స్టార్ రేటింగ్ మేరకు ఈ ఫీజులను నిర్ణయించారు. ఈ నిబంధనలను ప్రైవేటు పాఠశాలలు పాటించడం లేదు. సిలబస్ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ముద్రించే పుస్తకాలను బోధించాలి. కానీ కొన్ని పాఠశాలల్లో ఒక్కొక్క పబ్లికేషన్ పుస్తకాలను ఐటీఐ ఒరియంటెడ్ పేరుతో విక్రయిస్తూ వాటినే బోధిస్తున్నారు. ఆరోతరగతి నుంచి తొమ్మిదోత రగతి వరకు ఇంటర్‌స్థాయిలో ఉండే సిలబస్‌ను జోడించి సొంతంగా పుస్తకాలను విక్రయిస్తున్నారు. నిబంధనలు పాటించని పాఠశాలలను విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

ఫలించిన పోరాటం : రైతులు పండించిన పొగాకును కంపెనీలు సకాలంలో కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం నంద్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ నుండి చేపట్టిన ఆందోళనలు ఫలించాయి. రైతులు పండించిన పొగాకును కొనుగోలు చేయాలని కంపెనీల ప్రతినిధులతో డిఎఒ సమక్షంలో జరిగిన చర్చలు సఫలమయ్యాయి. పొగాకును కొనుగోలు చేస్తామని కంపెనీల ఎఫ్‌టిసిలు ఒప్పుకున్నారు. అయితే జూన్ 10లోపు జిల్లా వ్యాప్తంగా పొగాకు కొనుగోళ్లు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీ కృష్ణ ఆదేశించారు.

'క్రెడాయ్'తో సొంతింటి కల సాకారం

- నగరంలో ప్రాపర్టీ అండ్ బిల్డ్ టెక్ షో
- ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా స్టాళ్లు - పెద్ద ఎత్తున ప్రజాదరణ

ప్రాపర్టీ అండ్ బిల్డ్ టెక్ షోలో పాల్గొన్న ప్రజలు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా క్రెడాయ్ (కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్‌ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) కృషి చేస్తోంది. ఈ మేరకు శుక్రవారం వివిధ ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారులు బిల్డర్స్‌తో పెద్ద ఎత్తున ప్రాపర్టీ అండ్ బిల్డ్ టెక్ షో ను ఆ సంస్థ ఏర్పాటు చేసింది. ఈ షోకు నగరంలో పెద్ద ఎత్తున ప్రజాదరణ లభిస్తోంది. కర్నూలు ఎస్‌టిబిసి కళాశాల మైదానంలో ఈనెల 23న ప్రారంభమైన ఈ షో 26 వరకు కొనసాగుతుంది. ఈ ప్రాపర్టీ షోలో 40 కి పైగా స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఇందులో ఫ్లాట్స్, విల్లాస్, హోమ్ లోన్స్, ఓపెన్ ప్లాట్స్, కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్, ఇంటీరియర్స్, బిల్డింగ్ మెటీరియల్స్, ఫర్నిచర్ కన్‌స్ట్రక్షన్ మిషనరీ వంటి అనేక రకాల స్టాళ్లు అందుబాటులో ఉంచారు. ఈ ప్రదర్శనను సందర్శించడానికి క్రెడాయ్ సంస్థ వారు ఉచిత ప్రవేశాన్ని కల్పిస్తున్నారు. ప్రజలు తమకు అవసరమైన ఆధునిక సాంకేతికతతో కూడిన భవన నిర్మాణాలకు వీలుగా ఈ ఎక్స్‌పోను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇంటి నిర్మాణాలను చేపట్టదలచినవారు ఈ షోను సందర్శించి వారికి అవసరమైన అన్ని రకాల భవన నిర్మాణ సంబంధిత మెటీరియల్స్ సంబంధించిన అవగాహనను పెంపొందించుకోవడమే కాకుండా వారి అవసరాలను ఆకాంక్షలకు అనుగుణంగా ఫ్లాట్లను, ప్లాట్లను నేరుగా బుక్ చేసుకొని కొనుగోలు చేసే అవకాశం కూడా ఇక్కడ కల్పిస్తున్నారు. భవనం నిర్మాణం లేదా ఫ్లాట్ బుకింగ్ కోసం పది రకాల మందిని కలుస్తూ పది చోట్లకు కాళ్లు అరిగేలా తిరిగే కన్నా... ఎక్కువ సంఖ్యలో బిల్డర్స్‌ను మెటీరియల్ అమ్మకం దారులను ఒకే చోట కలిసే అవకాశాన్ని ఈ ప్రాపర్టీ షో కల్పిస్తోంది. దీంతో ప్లాట్లు, ఫ్లాట్లు భవన నిర్మాణ మెటీరియల్ కొనుగోలు చేయాలన్న ఆసక్తి కలిగిన వారే కాకుండా అవగాహన పెంచుకో దలచిన వారు కూడా ఈ షోను పెద్ద ఎత్తున సందర్శిస్తున్నారు. ఏదిఏమైనా ఈ ప్రాపర్టీ అండ్ బిల్డ్ టెక్‌షోను నిర్వహిస్తున్న క్రెడాయ్ సంస్థను ప్రజలు హర్షిస్తున్నారు.

ప్రజలకు సౌకర్యంగా ఉంచాలన్నదే లక్ష్యం

సగటు మనిషి జీవితంలో సొంతింటి నిర్మాణం ఎంతో ముఖ్యమైంది. అది కేవలం నిర్మాణం మాత్రమే కాదు ఆస్తి కూడా. ప్రజలకు భరోసా కల్పించేలా వారి అవసరాలకు అనుగుణంగా ఇళ్ల అమ్మకాలు చేసే సంస్థలను వారి వద్దకే తీసుకువచ్చి వారి శ్రమను సులభతరం చేయాలన్నది లక్ష్యంగా ఉంది. అందులో భాగంగానే ఈ ప్రాపర్టీ అండ్ బిల్డ్ టెక్ షోను నిర్వహిస్తున్నాం. చిన్న ప్లాట్ల నుంచి పెద్ద ప్లాట్ల వరకు అన్ని వర్గాల వారికి అవసరమైన ప్లాట్లను ఇక్కడ విక్రయిస్తున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

- నగరూరు శ్రీనివాసరావు, క్రెడాయ్ కన్వీనర్.

అత్యాధునిక సౌకర్యాలతో ఆనందించేలా..

అభివృద్ధి చెందిన నగరాల వాతావరణాన్ని కర్నూల్లో స్థాపించాం. ఏ ప్రాజెక్టు చేపట్టిని అత్యాధునిక వసతులతో కూడిన నిర్మాణాలను మా సంస్థ ఆధ్వర్యంలో నిర్మించాం. విశాలమైన సౌకర్యవంతమైన భవనాలే కాకుండా అందులో వినియోగించే ప్రతి మెటీరియల్, స్ట్రక్చర్, మౌలిక సదుపాయాలు ఇంటీరియర్స్ చూస్తే ఎవరైనా ఆశ్చర్య పోవాల్సిందే. తాము ఈ నిర్మాణాలు చేపట్టేటప్పుడు కర్నూలు నగరంలో ఇలాంటి ఫ్లాట్లు జిల్లాలు కొనే స్థితి ఉందా అని ఆశ్చర్యపోయారు కొంతమంది. నిజానికి మనం సరికొత్త నిర్మాణాలు చేపట్టి ఇచ్చినప్పుడే కస్టమర్లు సంతృప్తి చెందుతారన్నది నా ప్రగాఢ విశ్వాసం.

- సిహెచ్ అనంతనాయుడు, అనంత ఫిలింనగర్, మేనేజింగ్ డైరెక్టర్.

నాణ్యమైన నిర్మాణాలే మా ధ్యేయం

కస్టమర్లకు నాణ్యమైన నిర్మాణాలను అందించాలని మాధ్యేయం. స్టాల్ నెంబర్ ఎం7ను ఈ షోలో ఏర్పాటు చేశాం. కుడా అప్రూవల్‌తో కూడిన ఫ్లాట్లు, విల్లాస్, ఓపెన్ ప్లాట్లు మా వద్ద తక్కువ ధరకే లభిస్తాయి. పెద్దటేకూరు సమీపంలో, కర్నూలు రేడియో స్టేషన్ వద్ద డ్రీమ్ వ్యాలీ పేరుతో అత్యాధునిక సౌకర్యవంతమైన మౌలిక సదుపాయాలతో కూడిన ట్రిప్లెక్స్ విల్లాస్ నిర్మించాం. ప్రజల ఆకాంక్షల కనుగుణంగా నిర్మాణాలు ఉన్నాయి. బ్యాంకింగ్ లోన్ ఫెసిలిటీ కూడా అందుబాటులో ఉన్నాయి.

పి.సిద్ధయ్య, న్యూ స్నేహ బిల్డర్స్ మేనేజింగ్ డైరెక్టర్. క్రెడాయ్ మెంబర్.

ప్రతి నియోజకవర్గంలో స్టేడియం

- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

ప్రతి నియోజకవర్గంలో స్టేడియం ఏర్పాటు చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగా కర్నూలు నగరంలో క్రికెట్ స్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి వర్యులు టిజి. భరత్ పేర్కొన్నారు. శనివారం కర్నూలు మండలం మునగాలపాడు గ్రామం బాల సాయిబాబా స్కూల్ పక్కన ఉన్న ఎసిఎ క్రికెట్ గ్రౌండ్‌ను రాష్ట్ర మంత్రి టిజి. భరత్, విజయవాడ ఎంపీ ,ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు కేశినేని శివనాథ్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ గ్రౌండ్ విస్తీర్ణం ఎంత ఉంది, లెవెలింగ్ పనులు, ఫెన్సింగ్ పనుల పురోగతి గురించి మంత్రి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంచి ఆర్కిటెక్ట్ తో, అవసరమైన సౌకర్యాలతో, మంచి డిజైన్‌లతో స్టేడియంను అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఎసిఎ ప్రతినిధులకు సూచించారు. కేశినేని శివనాథ్ మాట్లాడుతూ గ్రౌండ్ ప్రణాళికను జూన్ 7 నాటికి రూపొందించాలన్నారు.అనంతరం అభివృద్ధి పనులు ప్రారంభించి, త్వరితగతిన గ్రౌండ్ నిర్మాణం పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ గ్రౌండ్ ను రోవర్‌తో సర్వే చేయించి నివేదికను రేపటి లోపు ఇవ్వాలని కలెక్టర్ కర్నూలు మండలం తహశీల్దారు ను ఆదేశించారు. అనంతరం మంత్రి, కలెక్టర్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలించారు. ట్యాంక్ ఎదురుగా ఉన్న భూమిని ఆక్రమణకు గురి కాకుండా చూసుకోవాలని మంత్రి మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఆ భూమిని ఎకోపార్క్‌లా అభివృద్ధి చేయాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ కోశాధికారి దండుమూడి శ్రీనివాస్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, కర్నూల్ ఆర్‌డిఒ సందీప్, కర్నూలు మండల తహశీల్దార్ రమేష్ బాబు, కర్నూలు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్

ఎండియు వాహనాలను కొనసాగించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయ్

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

గత ప్రభుత్వము ప్రజా పంపిణీ వ్యవస్థను ఎండియు మొబైల్ డిస్పెన్సివ్ యూనిట్ ద్వారా నేరుగా ప్రజలకు సరఫరా చేశారని ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ వ్యవస్థను రద్దుచేసి వేలాదిమంది ఆపరేటర్లను అసిస్టెంట్లను తొలగించడం దారుణమని తొలగించిన ఆపరేటర్లను అసిస్టెంట్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎండియు ఆపరేటర్లు కార్మిక కర్షక భవన్ కొత్త బస్టాండులో గల సిఐటియు కార్యాలయంలో ఆటో యూనియన్ న్యూ సిటీ కార్యదర్శి బి. రాధాకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయ్, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ, న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ మాట్లాడారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసి ప్రజలకు 9 రకాల నిత్యవసర సరుకులను ఎండియు ద్వారా ప్రజలకు పంపిణీ చేయాలని, గత వైసిపి ప్రభుత్వ హాయంలో బ్యాంకుల నుండి ప్రతినెల ఇఎంఐ చెల్లిస్తూ మొబైల్ వాహనాల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రజల ఇంటి దగ్గరికి తీసుకెళ్లింది. ప్రభుత్వం ఇచ్చిన సరుకులను ప్రజలకు అందించడంలో ఎండియు ఆపరేటర్ల ప్రజల మన్నలను పొందుతున్నారు. అటువంటి ఆపరేటర్లను అర్ధాంతరంగా జూన్ 1 నుండి తొలగిస్తున్నామని చెప్పడం సరైంది కాదన్నారు. రాష్ట్రంలో వేలాదిగా ఉన్న ఆపరేటర్లు వారి అసిస్టెంట్ల జీవితాలు ఆగమ్య గోచరంగా తయారయ్యా యని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల వేలాది కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. గత వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలన్నిటిని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని వారన్నారు. తొలగించిన వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమంగా ఈ కార్యక్రమాన్ని తీసుకుపోతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఎండియు జిల్లా కమిటీ ఏర్పాటు

కమిటీ గౌరవాధ్యక్షులుగా ప్రభాకర్ ,అధ్యక్షులుగా ఎస్. కేశవయ్య, ప్రధాన కార్యదర్శిగా అక్బర్ వలి, కమిటీకి ప్రత్యేక ఆహ్వానితులుగా న్యూ సిటీ ఆటో యూనియన్ కార్యదర్శి బి. రాధాకృష్ణ, ఓల్డ్ సిటీ ఆటో యూనియన్ కార్యదర్శి పి.మహిమూద్, కార్యదర్శులుగా చిట్టిబాబు, రవికుమార్, పూర్ణచంద్ర ,రమేష్, షేక్షావలి, డి.అక్బర్, నాగేశ్వరరావు, మద్దిలేటి, వీరేష్ కమిటీ కోశాధికారిగా ఎస్ఎండి రఫీ, శ్రీనివాసులు, ఇంకా 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. వివిధ మండలాల నుంచి వచ్చిన ఆపరేటర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్

పెండింగు వేతనాలు ఇవ్వాలి : వ్యకాసం

ప్రజాశక్తి-పత్తికొండ

పెండింగ్ లో ఉన్న 8 వారాల వేతనాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దస్తగిరి డిమాండ్ చేశారు. శనివారం పత్తికొండ ఈశ్వర్ రెడ్డి భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు రవిచంద్ర కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో దస్తగిరి మాట్లాడుతూ ఉపాధి కూలీలకు దాదాపు 8 వారాల నుండి వేతనాలు రాలేదని రోజువారి పనికి వెళ్తే తప్ప కుటుంబం గడవని పరిస్థితుల్లో ఉపాధి కూలీలు ఉంటున్నారన్నారు. వెంటనే పెండింగులో ఉన్న వేతనాలు చెల్లించాలని అదేవిధంగా పని ప్రదేశాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

పత్తికొండ మండల వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీ

అధ్యక్షులుగా కె.బుజులు, కార్యదర్శిగా పి.నరసన్న, సహాయకార్య దర్శిగా ఎం.ఈరన్న, చుక్కప్ప, ఉపాధ్యక్షులుగా శికామణి, కమిటీ సభ్యులుగా తిరుపాలు, అక్బర్, రషీద్, హోసూర్ నెట్టికల్లు, చంద్ర, పుచ్చకాయల మాడ పిఎన్ఎం జిల్లా కార్యదర్శి కాశన్న, ఆదినారాయణ, శ్రీనివాసులు, మండగిరి దస్తగిరి, మాబు, చక్రాల చంద్ర, పత్తికొండ పెద్దయ్య, సుంకన్న, శీనులను ఎన్నుకున్నారు.

రేషన్ షాపులను తనిఖీ చేసిన తహసీల్దార్

ప్రజాశక్తి-మంత్రాలయం

స్థానిక రేషన్ షాపులను తహసీల్దార్ ఎస్ రవి తనిఖీ చేశారు. శనివారం సంత మార్కెట్ సమీపంలో ఉన్న రేషన్ షాపు నెంబరు 1, రామచంద్ర నగర్ కాలనీలో ఉన్న రేషన్ షాపు నెంబరు 2, రాఘవేంద్ర నగర్ కాలనీలో ఉన్న రేషన్ షాపు నెంబరు 3 ల్లో గల స్టాకును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక రేపు నెల నుంచి లబ్ధిదారులు రేషన్ షాపుల వద్దే రేషన్ పొందాలని సూచించారు. మొబైల్ వాహనాలను రద్దు చేసినట్లు తెలిపారు. తూనికల విషయంలో ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట కంప్యూటర్ ఆపరేటర్ వీరేష్, విఆర్ఎ అనిల్ ఉన్నారు.

కర్నూలు ఎంపి కార్యాలయాన్ని సందర్శించిన విజయవాడ ఎంపి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు కార్యాలయాన్ని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) శనివారం సందర్శించారు. కర్నూలు మండలం మునగాలపాడు గ్రామంలోని ఏసీఏ క్రికెట్ గ్రౌండ్‌ను పరిశీలించిన కేశినేని చిన్ని, ఎం.పి నాగరాజు ఆహ్వానం మేరకు నగరంలోని అయన కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విజయవాడ ఎంపీకి శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం క్రికెట్ గ్రౌండ్‌కు సంబందించిన పలు అంశాలపై చర్చించారు.

కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుతో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్

యోగాతో మానసిక ప్రశాంతత

- నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నేటి యాంత్రిక యుగంలో యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు పేర్కొన్నారు. యోగా మాసోత్సవం భాగంగా శనివారం ఖానా–ఖజానా వద్ద 'స్ట్రీట్ యోగా' కార్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ ఆరోగ్యమే మనకు గొప్ప ఆస్తి అని, అందరూ ఆరోగ్య భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. భారత్‌లో సంప్రదాయంగా వస్తున్న వ్యవస్థ 'యోగా' పట్ల నేడు ప్రపంచం ఆసక్తి చూపుతుందని పేర్కొన్నారు. యోగా ఆసనాలు వేస్తే రోజంతా ఉత్సాహంగా ఉంటారని, కాబట్టి నగర ప్రజలందరూ యోగాను రోజువారి దినచర్యలో అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ఖానా–ఖజానా వద్ద నగరపాలక అధ్వర్యంలో వచ్చే నెల 21 వరకు ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుండి 7 వరకు యోగా ఆసనాలపై శిక్షణ నిర్వహించడం జరుగుతుందని, నగర ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో యోగా సంఘం కార్యదర్శి అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

యోగా కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్

పత్తి ఓబులయ్యకు ఎన్‌టిఆర్ పురస్కారం

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

నటరత్న ఎన్‌టిఆర్ జాతీయస్థాయి నాటిక పోటీల సందర్భంగా కళా రత్న పత్తి ఓబులయ్యకు ఎన్‌టిఆర్ పురస్కారం వరించినట్లు లలితకళాసమితి ప్రధానకార్యదర్శి మహమ్మద్‌మియా తెలిపారు. నేడు(25–05–2025) ఆదివారం సాయంత్రం 6 గంటలకు పలనాడు జిల్లా సాతులూరులో జరుగుతున్న పోటీల సందర్భంగా ఈ అవార్డును ప్రధానం చేస్తున్నారని కన్వీనర్ నడింపల్లి నరసింహారావు ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని ఆయన వెల్లడించారు.

ముగ్గురు ఎపిఎస్‌పి పోలీసుల సస్పెండ్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు ఎపిఎస్‌పి 2వ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు పోలీసులను క్రమశిక్షణ ఉల్లంఘనల కింద సస్పెండ్ చేస్తున్నట్లు బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. హెడ్ కానిస్టేబుల్ కె.ఓంకార్ నాయక్, కానిస్టేబుల్స్ బి.రాజశేఖర్, ఎస్‌కె సిరాజుద్దీన్ తోపాటు, ఇంచార్జ్ ఆఫీసర్‌కు కూడా మెమో జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పుస్తక పఠనం మంచి లక్షణం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యార్థులకు పుస్తక పఠనం మంచి లక్షణమని ఉపగ్రంథ పాలకురాలు వి. పెద్దక్క అన్నారు. జిల్లా గ్రంథాలయంలో వేసవి ఓరియంటేషన్ ప్రోగ్రాం వేసవి విజ్ఞాన తరగతులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉదయం 8 గంటలకు పుస్తక పఠనం విద్యార్థినీ విద్యార్థుల చేత చదివించారు. 8:30 గోపాలకృష్ణ స్టోరీస్, జనరల్ నాలెడ్జి సంబంధించిన విషయాలను విద్యార్థులకు వివరించారు. 9:30 జి. వెంకటేశ్వర్లు యోగ తరగతులు అనంతరం ఇందుమతి మేడం మెడిటేషన్ తరగతులను చెప్పారు. అనంతరం ముంతాజ్ బేగం విద్యార్థులకు పేపర్ కటింగ్ నేర్పించారు. 70 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

ఉద్యోగ 'ప్రయాణం'లో ఉద్యమ సారథి

- జూన్1న జె.దివాకర్ ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యార్థి దశ నుంచే ఇతరుల కోసం పనిచేయాలన్న తపన, మెరుగైన సమాజం కోసం సాగుతున్న ఆశయంలో తోడుగా నిలవాలన్న ఆకాంక్షతో జె.దివాకర్ తన ఉద్యోగ ప్రయాణంలో ఆర్‌టిసి సంస్థ అప్పగించిన పని చేస్తూనే తోటి ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై గళమెత్తారు. తమ సంస్థ అభివృద్ధి, పరిరక్షణ కోసం సాగిన ఉద్యమాల్లో వెన్నుదన్నుగా ఉంటూ నిర్బంధాలను సైతం లెక్కచేయకుండా పోరాడారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ సంఘాన్ని కర్నూలు జిల్లాలో బలోపేతం చేయడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తూ, ఆ సంఘంలో సాధారణ కార్యకర్త నుండి రాష్ట్ర స్థాయి నేతగా ఎదిగారు. ఉద్యోగ, కార్మిక సమస్యలపై గళమెత్తిన జె.దివాకర్ జూన్1న ఉద్యోగ విరమణ పొందుతున్న నేపథ్యంలో ఉద్యోగ, ఉద్యమ ప్రస్థానంపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం...

ఆయన 39 సంవత్సరాల 2 నెలల 7 రోజుల ఉద్యోగ జీవితంలో కండక్టర్ నుండి సూపరింటెండెంట్ (ఫైనాన్స్)గా బాధ్యతలు నిర్వర్తించారు. జె.దివాకర్ ఉద్యోగ విరమణ పొందుతున్నప్పటికీ ఉద్యమ విరమణ లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయన ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కోశాధికారిగా ఆర్‌టిసి సూపరింటెండెంట్ (ఫైనాన్స్)గా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లా (ప్రస్తుత నంద్యాల జిల్లా) పాములపాడు మండలం లింగాల గ్రామంలో 1963లో జల్లి నారాయణ, జల్లి లక్ష్మీదేవమ్మ దంపతులకు జె.దివాకర్ జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం సొంత గ్రామంలో, ఆ తర్వాత పాములపాడు, బ్రాహ్మణకొట్కూరులో సాగింది. ఇంటర్ నందికొట్కూరులో, డిగ్రీ వెలుగోడులోని ఎస్ఎన్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో పూర్తి చేశారు. ఇంటర్ చదువుతున్నప్పుడే ఎస్ఎఫ్ఐ పట్ల ఆకర్షితులై అందులో చేరి జిల్లా కమిటీకి ఎన్నికయ్యారు. ఆ తర్వాత డిగ్రీ చదువుతూనే ఎస్ఎఫ్ఐ ఆత్మకూరు తాలూకా కార్యదర్శిగా, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులుగా 1981 నుండి 1984 వరకు పనిచేశారు.

ఉద్యోగ ప్రస్థానం: 1986లో ఆర్‌టిసి కండక్టర్ గా తాత్కాలిక ఉద్యోగిగా బనగానపల్లె డిపోలో ఆయన ఉద్యోగ ప్రస్థానం మొదలైంది. 1987లో రెగ్యులర్ ఉద్యోగిగా మారారు. 1989 జూన్‌లో జూనియర్ అసిస్టెంట్ ఫైనాన్స్‌గా కడపలో పదోన్నతి పొందారు. అక్కడి నుంచి 1989 నుండి 2006 వరకు కర్నూలు ఒకటి, రెండు డిపోలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేశారు. 2006లో సీనియర్ అసిస్టెంట్ గాను, 2011లో మైదుకూరులో డిప్యూటీ సూపరింటెండెంట్ ఫైనాన్స్ పదోన్నతి పొందారు. 2012 ఫిబ్రవరి నుంచి హైదరాబాద్ బస్సు భవన్‌లో పనిచేశారు. 2016లో సూపరింటెండెంట్ ఫైనాన్స్‌గా విజయవాడలో పదోన్నతి పొంది నేటి వరకు ఆ ఉద్యోగంలో కొనసాగుతున్నారు. 2016లో నిర్వహించిన కృష్ణ పుష్కరాల సందర్భంగా చేసిన మంచి కృషికి గాను బెస్ట్ పర్ఫామెన్స్ ప్రశంసా పత్రాన్ని ముఖ్యమంత్రి నుండి అందుకున్నారు. 2025 రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ సేవలకు గాను (ఆడిట్ విభాగం) ఆర్‌టిసి ఎండి ద్వారకా తిరుమలరావుతో క్యాష్ అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఉద్యోగిగా తన తోటి ఉద్యోగ, కార్మికులకు వేతనాలు, అరియర్స్, ఇంక్రిమెంట్స్ విషయంలో సహాయ సహకారాలు అందించడం తన ఉద్యోగంలో సంతృప్తినిచ్చిందని ఆయన చెబుతారు.

ఉద్యమ ప్రస్థానం: విద్యార్థి నేతగా నేర్చుకున్న అనుభవాలతో ఆర్‌టిసి ఉద్యోగంలో చేరగానే స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్‌లో చేరి తన తోటి ఉద్యోగ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అవిశ్రాంత పోరాటాలు నిర్వహించారు. 1994 నుండి 2002 వరకు ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజినల్ కార్యదర్శి గాను, 2002 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఎపిలో 2014 నుండి నేటి వరకు ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్రకోశాధికారిగా, ఆర్‌టిసి వర్కర్స్ మాసపత్రిక ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. 2002 నుండి 2012 వరకు సిఐటియు కర్నూలు జిల్లా కోశాధికారిగా కొనసాగారు. 2002–2007 రెండు దఫాలుగా కర్నూలు 2 డిపో నుండి కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీకి ప్రతినిధిగా జరిగిన ఎన్నికల్లో రాష్ట్రస్థాయి రికార్డు మెజార్టీతో గెలిచారు. 2012 వరకు ప్రతినిధిగా పనిచేశారు. ఆర్‌టిసి పరిరక్షణ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 2005లో ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన తొమ్మిది రోజుల నిరవధిక నిరాహార దీక్షలో రాయలసీమ నుండి తను ప్రాతినిధ్యం వహించి ఆర్.లక్ష్మయ్య నాయకత్వంలో హైదరాబాద్‌లో దీక్షలో కూర్చున్నారు. 2001లో ఆర్‌టిసిలో జరిగిన 24 రోజుల చారిత్రాత్మక సమ్మెలో కర్నూలు జిల్లా కార్యదర్శిగా ఉంటూ లాఠీ చార్జీలు, అరెస్టులను ఎదుర్కొని సమ్మె విజయవంతం కోసం కృషి చేశారు. మద్దతుగా ఉన్న సిఐటియు ప్రదర్శనపై లాఠీచార్జి, 30 మంది సిఐటియు కార్యకర్తలను 34 రోజుల పాటు కడప సెంట్రల్ జైల్లో పెట్టడం వంటి పోరాటాలు కీలకమైనవి. హర్షవర్ధన్, విష్ణువర్ధన్ ఇద్దరు సంతానం కాగా ఇద్దరు మంచి చదువులు చదివి ఉన్నత స్థానంలో ఉన్నారని అన్నారు. ఉద్యోగంలోనూ, ఉద్యమంలోనూ తన సహచరి జె.శారద సహకారం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు.

కల్తీకి పాల్పడితే చర్యలు

విస్తృతంగా తనిఖీలు చేపట్టిన ఫుడ్ సేఫ్టీ అధికారుల బృందం

ప్రజాశక్తి-ఆదోని

ఆదోని పట్టణంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల బృందం విస్తృత తనిఖీలు చేపట్టారు. అధికారుల బృందం రాకను ముందుగానే తెలుసుకున్న కొందరు హోటళ్లు మూసేశారు. ఇతర తిను బండారాలు తిండి పదార్థాల విక్రయించే వారు ముందు జాగ్రత్త పడ్డారు. చిన్న మార్కెట్ రోడ్డు బిఎస్ టాకీస్ రోడ్డు వెంబడి ఉగ్గాని, బజ్జి, కలర్ వేసిన లడ్డు మిక్చర్ ప్లాస్టిక్ కవర్లలో ఎక్కువ రోజులు నిలువ ఉంచి విక్రయిస్తున్నారు. తిండి పదార్థాలు ఆరుబయట ఉంచి వాటిపై మూతలు కూడా ఉంచడం లేదు. దుమ్ము ధూళి ఈగలు వాలి అపరిశుభ్రంగా పరిసరాలు మారిన రుచిగా ఉందన్న కారణంగా పల్లెల నుంచి వచ్చిన వారు తిని రోగాల బారిన పడుతున్నారు. అధికారుల రాక గమనించి ముందు జాగ్రత్త చర్యగా జాగ్రత్త పడినట్టు వినియోగదారులు పేర్కొంటున్నారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశాలతో జిల్లా వినియోగదారుల రక్షణ మండలి ప్రత్యేక టీమ్ జిల్లా పౌర సరఫరాల అధికారి రాజా రఘువీర్ ఆధ్వర్యంలో ఆదోనిలో పలుచోట్ల ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రైతు బజార్, వ్యవసాయ మార్కెట్, ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి,పెట్రోల్ బంకు, వాటర్ ప్లాంట్లలో తనిఖీలు చేపట్టారు. రైతు బజారులో ఎటువంటి అనుమతులు లేకుండా వ్యాపారాలు కొనసాగిస్తున్న విక్రయ దారులు ముగ్గురిపై, అనుమతి లేకుండా వాటర్ పాకెట్లు తయారు చేస్తున్న నిర్వాహకునిపై, పెట్రోల్ బంకులో మౌలిక సదుపాయాలు లేని బంకు యాజమాన్యం పై, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సరైన ఆహారం అందించలేదని కాంట్రాక్టర్ పై కేసులు నమోదు చేశారు. 50గ్రాముల కోడిగుడ్డు రోగులకు ఎలా ఇస్తారని ప్రభుత్వ ఆసుపత్రిలోనే నిర్వాహకులపై మండిపడ్డారు. అన్నం నాణ్యతగా ఉండాలని చారు, కూరగాయలలో వాడిన కారం నాన్యతగా లేదని అధికారులు తెల్చాచారు. ఫుడ్ సేఫ్టీ ప్రత్యేక టీమ్ దాడులతో అక్రమాలకు పాల్పడేవారు హడలెత్తిపోయారు. చాలాకాలం తర్వాత వూహించని రీతిలో తనిఖీలు చేయడం పట్ల వినియోగదారులు అధికారుల తీరుపై హర్షం వ్యక్తం చేశారు. ఏది అసలు నకిలీ తెలియక కొనుగోలు చేస్తూ నష్టపోతున్నామే కాకుండా అనారోగ్యం పాలు అవుతున్నామని వాపోయారు. ఇన్ని శాఖల అధికారులు ఉన్నా బహిరంగంగా తనిఖీలు చేయకపోవడం వల్ల అక్రమార్కులు రెచ్చిపోతున్నారని చెబుతున్నారు. తరుచూ తనిఖీలు నిర్వహించి కల్తీలు అక్రమాలు కట్టడి చేయాలని వినియోగదారులు కోరారు. తనిఖీలు ప్రతినెల జరుగుతాయని, రాష్ట్రంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వినియోగదారుల రక్షణ మండలి ఏర్పాటు చేసి తనిఖీలు చేయడం మొదటి సారిని, ఈ కమిటీ కు జిల్లా జాయింట్ కలెక్టర్ చైర్మన్గా ఉన్నారని కమిటీ నోడల్ అధికారి రాజా రఘువీర్ తెలిపారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో డిఎస్ఒ రాజా రఘువీర్తో పాటు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రాజా గోపాల్ రావు, జిల్లా తూనికల కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ రామిడు. ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సత్యవతి, జిల్లా వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ క్లైక్, ఆదోని మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సందీప్, జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యులు ఈసా బాషా, శివ మోహన్ రెడ్డి, డెప్యూటీ తహశీల్దార్ వలి బాషా వున్నారు.

ఆదోని మార్కెట్లో తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారుల బృందం

సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధుల గైర్హాజరు

- సమావేశాలకు రాలేకపోతే సమస్యలు ఎలా తెలుస్తాయి
- ఎంపిపి జూటూరు హేమలత

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రతి మూడు నెలలకు ఒకసారి సమస్యలను ,అభివృద్ధి పనులపై జరిగే సర్వసభ్య సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు రాకపోతే సమస్యలు ఎలా తెలుస్తాయని ఎంపిపి జూటూరు హేమలత తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శనివారం మండల కార్యాలయంలో ఎంపిడిఒ అల్లా బకాష్ ఆధ్వర్యంలో ఎంపిపి జూటూరు హేమలత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు తమ శాఖలలో జరిగిన పలు అభివృద్ధి పనులు, జరగబోవు అభివృద్ధి పనులపై మాట్లాడారు. తాగునీటి సమస్య గురించి చిప్పగిరి సర్పంచి దాసరి గోవిందరాజులు సమావేశం దృష్టికి తెచ్చారు. పంచాయతీరాజ్ ఎఇ సోమప్ప మాట్లాడుతూ మండలంలో జరిగిన సిసి రోడ్ల నిర్మాణాలకు బిల్లులు త్వరలోనే మంజూరు అవుతాయన్నారు. పెండింగులో ఉన్న సిసి రోడ్లను ఉన్నతాధికారులకు తెలిపి త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఎంఇఒ సావిత్రమ్మ మాట్లాడుతూ నగరడోన, నంచర్ల గ్రామాలలో 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అప్ గ్రేడ్ అయ్యాయన్నారు. అనంతరం ఎంపిపి హేమలత మాట్లాడుతూ సభ్యులందరికీ సమస్యలపై పూర్తి అవగాహన ఉంటుందన్నారు. ఆ సమస్యలను తెలపడానికి మూడు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశాలకు రాలేక పోతే వారిపై ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళతాయన్నారు. అధికారులు, ప్రతినిధులు సమన్వయంతో ముందుకెళితేనే గ్రామాలు అభివృద్ధి బాటలోపైనిస్తాయన్నారు. వర్షాలు సమృద్ధిగా వస్తున్నాయని, వ్యవసాయ అధికారులు ముందు చూపుతో రైతులకు కావలసిన విత్తనాలను సకాలంలో అందేటట్లు చూడాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. గ్రామాలలో తాగునీటి సమస్య ఏర్పడకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు తెలిపారు. సర్పంచి కరివేముల సావిత్రి, ఎంపిటిసిలు ఎల్లంకి రజిని, సరోజమ్మ తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, ఏవో శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపిడిఒ బాలన్న, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ మల్లికార్జున్ రెడ్డి, డాక్టర్ అఫ్రోజ్ జహన్, ఏపీఎం నాగార్జున, ఎపిఒ జుబేర అహ్మద్, సూపర్వైజర్ ప్రసూన, హౌసింగ్ ఎఇ భవ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి జూటూరు హేమలత

అందరి సహకారంతో 'బాలలను సంరక్షిద్దాం'

- జూనియర్ సివిల్ జడ్జి టి. జ్యోత్స్నదేవి

ప్రజాశక్తి - పత్తికొండ

తప్పిపోయిన బాలలను అందరి సహకారంతో సంరక్షిద్దామని పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి టి.జ్యోత్స్నదేవి పేర్కొన్నారు. పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో మండల న్యాయ సేవధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన తప్పిపోయిన బాలల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. సమాజంలో బాలల హక్కులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, బాలల హక్కుల గురించి అవగాహన సదస్సులు నిర్వహించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా పోలీసు, స్త్రీ శిశుసంక్షేమ, విద్యాశాఖ, న్యాయ సేవధికార సంస్థ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ద్వారా బాలులను సంరక్షించి, వారి హక్కులను కాపాడి, వారికి తోడ్పాటు అందిద్దామని తెలిపారు. సమావేశంలో ప్యానల్ అడ్వకేట్ సూరజ్ నబి, న్యాయవాదులు రవి ప్రకాష్, రంగస్వామి, నరసింహచారి, అర్బన్ సీఐ జయన్న, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సుమిత్ర, త్రివేణి, ఎంఇఒ రమేష్, యువ స్పందన సొసైటీ సెక్రటరీ నాగరాజు, కోర్టు, లోక్ అదాలత్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జిజ జ్యోత్స్నదేవి

అంతా హడావుడి..

-ఆన్లైన్ బదిలీలకు సాంకేతిక సమస్య
-పాయింట్ల కేటాయింపులో కొందరికి అన్యాయం
-విద్యాశాఖ తీరుపై ఉపాధ్యాయులు ఆగ్రహం
-బదిలీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి -
-యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

దాదాపుగా రెండు సంవత్సరాలు తర్వాత జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలు పారదర్శకంగా నిర్వహిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. వేసవి సెలవులు ముగుస్తున్న సమయంలో హడావిడిగా ఉపాధ్యాయుల బదిలీలను నిర్వహిస్తుంది. ఈ బదిలీలు ఆన్లైన్ ఆధారితంగా నిర్వహిస్తున్నడంతో సాంకేతిక సమస్యలు తీవ్రంగా నెలకొంది. కొంతమంది ఉపాధ్యాయులకు పాయింట్ల కేటాయింపులో కూడా అన్యాయం జరుగు తుందని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి. ఉపాధ్యాయుల బదిలీల నిర్వహణకు ప్రతి ఏడాది చేపట్టేలా ప్రత్యేకంగా చట్టాన్ని కూడా రూపొందించింది. ఉపాధ్యాయుల బదిలీల్లో నెలకొన్న అనేక అసంబద్ధమైన అంశాలు నెలకొనడంతో ఉపాధ్యాయ సంఘాలు నిరసన వ్యక్తం చేశారు. బదిలీల పట్ల ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వ్యతిరేకిస్తూ ఆందోళనబాట కూడా సిద్ధమకావడంతో ఎట్టకేలకు దిగివచ్చి ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి బదిలీలను నిర్వహించేందుకు ముందుకొచ్చింది. ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ఆన్లైన్ దరఖాస్తు చేసుకునేందుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు అనేకమంది ఉపాధ్యాయులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకునేందుకు వెళితే దరఖాస్తు ఫారం తీసుకోకుండా సర్వర్ మొరాయిస్తుంది. బదిలీల షెడ్యూల్ ని కూడా ఇప్పటికిప్పుడు హడావిడిగా విడుదల చేసి చేస్తున్న నిర్వహిస్తున్న తీరు పట్ల ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతమందికి ఉపాధ్యాయులకు పాయింట్లు కేటాయింపులు తీవ్ర అన్యాయం జరుగుతుంది. రెండు డిఎస్సిల ద్వారా నియమితులైన ఉపాధ్యాయులు పాయింట్లు కేటాయింపులో పాత స్టేషన్ నుండి కాకుండా రెండో డిఎస్సి ద్వారా నియమితులైన స్థానం నుండి పాయింట్లు ఇవ్వడం పట్ల అనేకమందికి తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఉపాధ్యాయుల సమాచారం సంబంధించి కటీ స్ పోర్టల్లో పూర్తిస్థాయి సమాచారాన్ని పెట్టారు. ఇప్పుడు బదిలీలకు సంబంధించి ప్రత్యేక పోర్టల్ ద్వారా చేపడు తున్నారు. ఉపాధ్యాయుల సమాచారం పొందుపరిచిన పోర్టల్లో కాకుండా ప్రత్యేకంగా నిర్వహిస్తుండడంతో అనేక సమస్యలు లేవనెత్తుతున్నాయి. ఇటీవల రెండు నెలల కాలంలో కొంతమంది ఉపాధ్యాయులు అనారోగ్యం బారిన పడ్డారు. కొంతమంది ఉపాధ్యాయులు భర్తలు చనిపోయినటువంటి ఘటనలు నెలకొన్నాయి. అలాంటి వారికి బదిలీల్లో ప్రత్యేక పాయింట్లు పొందలేని పరిస్థితి నెలకొంది.

ఉపాధ్యాయుల బదిలీలు ఇలా....

టీచర్ల బదిలీలకు సంబంధించి జిల్లాలో 2798 అన్ని కేటగిరీలలో ఖాళీలు ఉన్నాయి. ప్రధానోపాధ్యాయులు ఐదు నుంచి ఎనిమిది సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసినా ఖాళీలు 2713 వున్నాయి. స్కూల్ అసిస్టెంట్ కన్వర్ట్ ద్వారా 251 ఎస్జిటి కన్వర్ట్ ద్వారా 93 పోస్టులు అప్ గ్రేడ్ ద్వారా 100 పోస్టులు, కొత్తగా సృష్టించిన ఖాళీలు 1449, సర్ ప్లస్ షిఫ్ట్ ద్వారా 1143 పోస్టులు కలిపి మొత్తం 8047 జిల్లావ్యాప్తంగా ఖాళీలు ఉన్నాయి.

ఉపాధ్యాయులకు పాయింట్ల కేటాయింపు విధానం:

కేటగిరీ-1 (పట్టణ ప్రాంతాలు): సంవత్సరానికి 1 పాయింట్

కేటగిరీ-2 (మునిసిపల్ ప్రాంతాలు): సంవత్సరానికి 2 పాయింట్లు

కేటగిరీ-3 (గ్రామీణ ప్రాంతాలు): సంవత్సరానికి 3 పాయింట్లు

కేటగిరీ-4 (మారుమూల ప్రాంతాలు): సంవత్సరానికి 5 పాయింట్లు

పని చేసిన మొత్తం సర్వీస్ కాలానికి: సంవత్సరానికి 0.5 పాయింట్లు

భార్యభర్తలు ప్రభుత్వ ఉద్యోగులైతే: 5 పాయింట్లు (ఒకరికి మాత్రమే వర్తిస్తుంది. అవివాహిత మహిళా ఉపాధ్యాయులకు: 5 పాయింట్లు

40%-55శాతం శారీరక వైకల్యం లేదా 60 శాతంనుంచి 70 శాతం వినికిడి లోపం ఉన్నవారికి 5 పాయింట్లు, 40 శాతం దృష్టిలోపం లేదా 56 నుంచి 59 శాతం శారీరక వైకల్యం ఉన్నవారికి ఏడు పాయింట్లు ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులకు ఐదు పాయింట్లు, విడాకులు తీసుకుని మళ్లీ పెళ్లి చేసుకోని మహిళా టీచర్లు, సైనిక విభాగాల్లో పని చేసి టీచర్లుగా ఉన్నవారికి ఐదు పాయింట్లు, స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ను 2 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు 5 పాయింట్లు, పునర్విభజనలో తప్పనిసరిగా బదిలీ అయ్యే ఉపాధ్యాయులకు ఐదు పాయింట్లు. ప్రాధాన్యత ఇస్తున్నారు.

వందశాతం దృష్టిలోపం లేదా 80శాతంకు పైగా శారీరక వైకల్యం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత, 75శాతం దృష్టిలోపం, 70శాతం -79శాతం శారీరక వైకల్యం లేదా 70శాతం పైగా వినికిడి లోపం ఉన్నవారికి రెండో ప్రాధాన్యత, పునర్వివాహం చేసుకొని వితంతువులు, క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, బోనోటీసీ, కిడ్నీ మార్పిడి, డయాలసిస్, స్పైనల్ సర్జరీ చేసుకున్న వారు, జీవిత భాగస్వామి లేదా పిల్లలు జువనైల్ డయాబెటిస్, తలసేమియా, హీమోఫిలియా, కండరాల క్షీణతతో బాధపడుతున్నవారికి వైద్య చికిత్స పొందుతున్నవారు.

డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు రవికుమార్, నవీన్పాటి

సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

ఉపాధ్యాయుల బదిలీల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యుఆర్ఎ రవికుమార్ బి.నవీన్ పాటి లు డిమాండ్ చేశారు. శనివారం డిఇఒ ఎస్ శామ్యూల్ పాల్కు యుటిఎఫ్ జిల్లా ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆ సంఘ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యుఆర్ఎ రవికుమార్ బి.నవీన్ పాటి జిల్లా కార్యదర్శి తిమ్మన్న జిల్లా సీనియర్ నాయకులు జయరాజు, హనుమంతు, మద్దిలేటిలు ఉన్నారు. ఈ సందర్భంగా వారు డిఇఒకు ఉపాధ్యాయుల బదిలీల్లో నెలకొన్న అనేక సమస్యలను వివరించారు. అనేకమందికి ఉపాధ్యాయులకు బదిలీల దరఖాస్తు చేసుకునేందుకు సర్వర్ పనిచేయడం లేదన్నారు. విడో లీగల్లీ సపరేటెడ్ వారికి స్పెషల్ పాయింట్లు ప్రివ్యూలో కనబడుతున్నాయని, సబ్మిట్ చేసిన తర్వాత కనబడుటలేదని దీన్ని సరి చేయాలన్నారు. ఎస్జిటిగా పనిచేసి పైఅధికారులు అనుమతితో డిఎస్సి రాసుకుని స్కూల్ అసిస్టెంట్గా సెలెక్ట్ అయిన వారికి ఎస్జిటి సర్వీస్ పాయింట్లు ఇవ్వాలన్నారు. రీ అపోర్షన్ మెంట్ గురైన వారికి ఓల్డ్ స్టేషన్ పాయింట్లు రావడం లేదని, దాన్ని సరి చేయాలన్నారు. స్టేషన్ పాయింట్లు సీలింగును ఎనిమిదేళ్లనుంచి నుంచి కనీసంగా పదేళ్లకు పెంచాలన్నారు. అవివాహిత మహిళలకు 40 సంవత్సరాల నిబంధనను తొలగించాలన్నారు. అవివాహిత వారికి సబ్మిట్ చేసిన తర్వాత స్పెషల్ పాయింట్స్ కనబడడం లేదన్నారు. రేషనలైజేషనుకు గురైన స్కూల్ అసిస్టెంట్స్కు ఓల్డ్స్టేషన్ పాయింట్స్ ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన తేదీలను పొడిగించాలన్నారు.

అదనపు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ అవసరం

ప్రజాశక్తి-ఆదోని : ఆదోని పట్టణంలో పెరుగుతున్న జనాభా కనుగుణంగా అదనంగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు ఏర్పాటు చేసి తాగునీటి ఎద్దడి రాకుండా నివారణ చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, తిప్పన కోరారు. మున్సిపల్ చైర్మన్గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన లోకేశ్వరిని కార్యాలయంలో పూలమాల శాలువాతో సన్మానం చేశారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడారు. ఆదోని పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించాలని, తరచుగా అధికారులను కోరుతూనే ఉన్నామన్నారు. నిత్య కళ్యాణం పచ్చ తోరణం మాదిరి గతంలో ఆదోని రెండవ ముంబైగా ప్రసిద్ధి గాంచిన పట్టణంలో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా విలయతాండవం చేస్తున్నాయన్నారు. మంచినీటి సమస్య పరిష్కారానికి ఆదోని పట్టణ జనాభాకు అనుగుణంగా పట్టణంలో మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలన్నారు. శివారు ప్రాంతాలలో ఇప్పటికే నీరు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణంలో కూలడానికి సిద్ధంగా ఉన్న పాతపై ఓవర్ బ్రిడ్జి పునర్ నిర్మించాలన్నారు. పట్టణంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పనులు వెంటనే ప్రారంభించాలని, పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రభుత్వమే ఉచితంగా సిటీ స్కాన్, ఎమ్మారై కేంద్రాన్ని ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. పట్టణంలో సేద తీరడానికి కూర్చోవడానికి ఆహ్లాదకరమైన పార్కులు లేవన్నారు. ఎంఐజి, ఎల్ఐజి, కాలనీలలో ఉన్న పార్కులలో ఆటపరికరాలు ఏర్పాటు మరిన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. కల్లుబావిలో స్మశాన వాటికకు కాంపౌండ్ వాల్ నిర్మించి, నీటి సౌకర్యం కొరకు బోరు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు వెంకటేశులు, వీరేష్, వెంకటేష్ వున్నారు.

మున్సిపల్ చైర్మన్కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

నీటి సమస్య పరిష్కారం

- ప్రజాశక్తి కథనానికి స్పందన
- ఎమ్మెల్యే బీవీకి ధన్యవాదాలు తెలిపిన ప్రజలు

ప్రజాశక్తి - నందవరం

కోటవీధులో కొంతకాలంగా ప్రజల పడుతున్న నీటి సమస్య ఎట్టకేలకు తీరింది. ప్రజాశక్తిలో ప్రచురించిన "ఆదిపత్య పోరుతో నీటి ఎద్దడి" కథనానికి స్పందన లభించింది. గతంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కోట వీధి ప్రజలకు నీటి కష్టాలు తీర్చాలన్న సంకల్పంతో ఓవర్ ట్యాంక్ నిర్మించారు. కొన్నేళ్లుగా ఆ ట్యాంకు నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం ఆ ట్యాంక్ కోట వీధి ప్రజలకు అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆ ట్యాంకు ద్వారా వీధి ప్రజలకు నీటిని సరఫరా చేశారు. నీటి సమస్య తీరడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పల్లె నిద్రలో ఇచ్చిన మాటను ఎమ్మెల్యే నిలుపుకున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి, అధికారులకు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. ఎఇ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ.. కోట వీధి ప్రజల నీటి సమస్యపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. ఆ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే పలుమార్లు ఆదేశించారని చెప్పారు. ఆయన ఆదేశాల మేరకు నీటి సమస్యను పరిష్కరించామని ఎఇ చెప్పారు.

ఇంటి నిర్మాణాలు చేపడతాం : పిడి

ప్రజాశక్తి - నందవరం

నందవరం మండలం నాగలదిన్నె గ్రామం ఇళ్ల లబ్ధిదారులకు త్వరలో ఇంటి నిర్మాణాలు చేపడతామని హౌసింగ్ పీడీ చిరంజీవి పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలో పర్యటించి లబ్ధిదారులతో సమావేశమై మాట్లాడారు. లబ్ధిదారులకు జమ కానీ ఎన్ఆర్ఈజీఎస్ నగదును ఆప్షన్-3 ఏజెన్సీ వారికి చెల్లించి ఇల్లు ప్రారంభం నుండి స్లాబ్ వర్క్ వరకు చేయిస్తామని చెప్పారు. అలాగే కొత్తగా ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి త్వరలోనే ఇంటి నిర్మాణాలకు శ్రీకారం చూడతామన్నారు. గ్రామంలో ఉన్న ల్యాండ్ సమస్యపై తహశీల్దార్ను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నీటి సమస్య లేకుండా చూడాలని సర్పంచికి సూచించారు. సమావేశంలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఓ పుల్లయ్య, హౌసింగ్ డిఒ ప్రసాద్, ఎఇ వెంకటేష్, టీడీపీ నాయకులు ఈరన్న, ఎల్లేష్ పాల్గొన్నారు.

నిరుపేదలపై 'కూటమి' భారాలు

- ఎంపిపి జూటూరు హేమలత

ప్రజాశక్తి - చిప్పగిరి



నిరుపేదలపై కూటమి ప్రభుత్వం భారాలు మోపుతూ ఇబ్బందులకు గురి చేస్తుందని ఎంపిపి జూటూరు హేమలత విమర్శించారు. మండల కేంద్రమైన చిప్పగిరిలో బర్మీ భోజరాజు కుమారుడు వివాహ వేడుకకు ఆమె శనివారం ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అందిస్తామని చెప్పి కాలయాపన చేస్తుందన్నారు. విద్యార్థులకు అమ్మకు వందనం, రైతులకు త్వరలోనే పెట్టుబడి నిధులను విడుదల చేస్తున్నామని ప్రభుత్వం చెబుతుందే కానీ ఎంతవరకు న్యాయం చేస్తుందో చూడాలన్నారు. వైసీపీ సీనియర్ నాయకులు బర్మే ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని పాణ్యం నియోజకవర్గ కల్లూరు 16 వార్డుల అభివృద్ధికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి ఆదేశించారు. శనివారం ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో కమిషనర్ ఎస్.రవీంద్ర బాబుతో కలిసి నగరపాలక అధికారులు, సచివాలయ సిబ్బందితో కల్లూరు వార్డుల అభివృద్ధిపై సమీక్షించారు. ముందుగా వార్డుల వారీగా అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. అనంతరం వార్డుల్లో పేర్కొన్న స్థానిక సమస్యలపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్లూరు అర్బన్ అభివద్ధికి తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, వాటికి మంచి ఫలితాలు వచ్చేలా అందుకనుగుణంగా అధికారులు పనిచేయాలని కోరారు. తాగునీటిని సమస్య పరిష్కారానికి, మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.187 కోట్లు నిధులను మంజూరు చేసిందని, జగన్నాథ గట్టుపై 50 ఎంఎల్డి నీటి శుద్ధి కేంద్రానికి రూ.115 కోట్లు, పుచ్చలపల్లి సుందరయ్య పార్కులో 12 ఎంఎల్డి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణానికి రూ.22 కోట్లు, కల్లూరు అర్బన్ వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.50 కోట్లను ముఖ్యమంత్రి కేటాయించారని, ఈ పనులన్నీ చకచకా జరిగేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ఒక్కో వార్డులో ప్రాధాన్యత క్రమంలో రూ.50 లక్షలతో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం లభించేంత వరకు ఎద్దడి తలెత్తకుండా అప్పటిలోపు తాత్కాలిక సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో సమస్యలను ఒక్కటొక్కటిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, వార్డుల్లో పేర్కొన్న సమస్యలను సైతం త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నగరపాలక సాధారణ నిధులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు ప్రణాళికలను ఎప్పటికప్పుడు రూపొందిస్తున్నామని, రహదారులు, మురుగు కాలువలు, వీధి దీపాల ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేసేందుకు కషి చేస్తామన్నారు. చిన్నపాటి సమస్యలను తమ అధికారుల దృష్టికి వచ్చినా వెంటనే పరిష్కరిస్తున్నామని, తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి సైతం చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశం అనంతరం.. 20వ వార్డు బద్రినాథ్ నగర్లో రూ. 50 లక్షలతో సిసి డ్రైన్ నిర్మాణానికి ఎమ్మెల్యే, కమిషనర్ శంకుస్థాపన చేశారు.

మాట్లాడుతున్న గౌరుచరితరెడ్డి

అన్న క్యాంటీన్ అల్పాహారం తనిఖీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు : సోమప్ప సర్కిల్లో ఉన్న అన్న క్యాంటీన్ అల్పార పంపిణీని మున్సిపల్ కమిషనర్ ఎన్. గంగిరెడ్డి శనివారం తనిఖీ చేశారు. అలాగే హెచ్.బి.ఎస్ కాలనీ, పార్క్ రోడ్డు, కమిటీ రోడ్, గంజెళ్ల రోడ్ ఏరియాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు.

నీటి సమస్యకు పరిష్కారం : టిడిపి

పట్టణంలోని 14వ వార్డు బైపాస్ రోడ్డు దగ్గరలోని నురానీ సప్లాయర్స్ పక్కన ఉన్న వీధిలో నెలకొన్న తాగునీటి సమస్యను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరెడ్డి సహకారంతో పరిష్కరించినట్లు టిడిపి నాయకులు నవాజ్ శనివారం తెలిపారు. సమస్యల పరిష్కారానికి రూ. 1లక్షా 20వేలతో పైప్ లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నీటి సమస్య పరిష్కారం కవడంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారని నవాజ్ తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించిన వైసిపి బృందం

-వైసిపి ప్రభుత్వ హయాంలోని పనులన్నీ పూర్తి
- బుట్టా రేణుక

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరులో వంద పడకల ఆసుపత్రి భవనాన్ని ఎమ్మిగనూరు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్, మాజీ ఎంపి బుట్టా రేణుక, పార్టీ సీనియర్ నాయకులు బుట్టా శివనీలకంత, యువ నాయకుడు బుట్టా ప్రతుల్ పరిశీలించారు. శనివారం పట్టణంలోని వంద పడకల ఆధునిక ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మాణ ప్రగతిని పర్యవేక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి, సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోగ్య రంగ అభివృద్ధికి అపూర్వమైన నిధులను కేటాయించి శక్తివంతమైన సదుపాయాలు కలిగిన ఆసుపత్రులు నిర్మానాలు జరిగాయన్నారు. ఎమ్మిగనూరులో రూ.12.60 కోట్ల వ్యయంతో2020 ఏప్రెల్3న అప్పటి ఎమ్మెల్యే కె చెన్నకేశవ రెడ్డి భూమి పూజ చేసి పనులు పరంభించారన్నారు. నిర్మించిన వంద పడకల ఆసుపత్రి, వైద్య రంగ ప్రగతికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. అప్పటికే ఆసుపత్రి అంతర్గత పనులు పూర్తయ్యి, మౌలిక వసతుల ఏర్పాటుకు తుదిదశకు చేరుకుందన్నారు.మేము ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్న ఈ ఆసుపత్రిని, ఎన్నికల కోడ్ కారణంగా ప్రారంభించలేకపోయామని వివరించారు. టిడిపి హయాంలో మిషన్ షెల్ఫ్పై పెట్టిన ఫైళ్లతో పాటు, ఎన్నో శిలాఫలకాలను మాత్రమే ప్రజలకు చూపిస్తూ మభ్యపెట్టే నాటకాలు జరిగాయి. 2003లో బివి మోహనరెడ్డి, 2019లో బివి జయనాగేశ్వరరెడ్డి ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. నిర్మాణానికి అవసరమైన నిధుల్ని మంజూరు చేయలేదు. ప్రజల అవసరాలను తాకట్టు పెట్టి ఎన్నికల ముందు హడావుడిగా చేసిన కార్యక్రమాలు కేవలం రాజకీయ మాయాజాలమే. వాస్తవానికి టిడిపి నేతలకు అభివృద్ధిపై అవగాహన లేకుండా, ప్రచారాలకే పరిమితమయ్యారన్నారు. వైసిపి హయాంలోనే ఆసుపత్రి భవనం అత్యాధునిక సాంకేతికతతో నిర్మించారన్నారు. వైద్య విభాగాల్లో ఏర్పాటుకు ప్రత్యేక వైద్యుల్ని నియమించామన్నారు. ఇప్పటికే 105 మందికి పైగా వైద్య సిబ్బంది నియమితులయ్యారని ఆమె పేర్కొన్నారు. టీడీపీ నేతలు ప్రజల ఆరోగ్యాన్ని తమ రాజకీయ ప్రయోజనాలకే తాకట్టు పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నిర్మాణం పూర్తి అయినా భవనానికి మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్రారంభించి తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, ఇంచార్జులు, రాష్ట్ర స్థాయి నాయకులు, జిల్లా స్థాయి నాయకులు, నియోజకవర్గ స్థాయి నాయకులు, పట్టణ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎంపి బుట్టారేణుక

IN THE COURT OF THE HON'BLE XXI JR. CIVIL JUDGE CITY CIVIL COURT AT :: HYDERABAD O.S.NO. 3675 OF 2023

Between:
Radiant Systems (India) Pvt. Ltd., Rep. by its Associate Director, Mr. B.Satyanarayana, H.No.8-2-120/113, 3rd Floor, Block-C Sanali Info Park, Road No.2, Banjara Hills, Hyderabad-500034.
AND
...Plaintiff
Mr. Shaik Anish & others
... Defendants

To
D3.Mr.Shaik Jamal Vali. C/o. Shaik Dastgiri Aged about 57 Years 27-325, Moolasagaram, Nandyal, Kurnool District Andhra Pradesh-518501

It is hereby notified that the Plaintiff filed the above Suit against you for recovery of amount and the above OS NO 3675 of 2023 is posted to 12-06-2025 for your appearance.

Therefore, you are hereby requested to appear on 12-06-2025 at 10.30AM before the above said court in the above matter, failing which the matter will be decided ex-parte.

// BY ORDER//

K.GOPAL
G.L.NARENDER
A.V. NARAYANA RAO
R.VIJAYA LAKSHMI
Advocates
#2-3-512/105, Bapunagar, Amberpet, Hyderabad-13.